


తొలివెలుగు జాతీయపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.

సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365




| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 47 | శనివారం | 12 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ యంజాల ప్రవీణ్ | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.47 | Saturday | 12.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |


## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం.

- 1 రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు
- 1 కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు
- 1 గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం



2లో




2లో

## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్
- జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి ఐదేళ్ల ప్రపంచ వృద్ధిలో బ్రిక్స్ వాటా సగానికి పైగానే ఉందని వెల్లడి
- జీ7 వృద్ధి వాటా 18 శాతంగా ఉందని ప్రస్తావన
- బ్రిక్స్ కోసం కొత్త పెట్టుబడి వేదిక ఏర్పాటుకు పుతిన్ ప్రతిపాదన

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ



# విద్యే జీవితాన్ని మారుస్తుంది..

- విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమన్న సీఎం
- ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని వెల్లడి
- 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులున్నట్లు వెల్లడి
- ఏడాదిలో 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు ప్రకటన
- 10,600 మంది టీచర్లకు 55 రోజుల్లో నియామక పత్రాలిచ్చినట్లు వెల్లడి

విద్యే జీవితాలను మార్చే శక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడే పరిస్థితి ఉంటుందని చెప్పారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైందన్నారు. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తెలంగాణ విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చుతున్నామని అసెంబ్లీలో తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు

- మిగతా 2వ పేజీలో






# శాంతిభద్రతలే లక్ష్యం

## 'త్రిశూల్' పేరుతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం

- డ్రగ్స్, మహిళలపై వేధింపులు, రోడ్డు ప్రమాదాల నిర్మూలనే లక్ష్యం
- సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై కఠిన చర్యలకు దిశానిర్దేశం
- రాష్ట్రంలో నేరాల రేటు 14 శాతం తగ్గిందన్న ముఖ్యమంత్రి
- రోడ్డు ప్రమాదాల్లో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఆవేదన

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఎస్పీలు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'త్రిశూల్' పేరుతో ప్రత్యేక కార్యాచరణకు ఆయన శ్రీకారం చుట్టారు. 'జీరో డ్రగ్స్, మహిళలపై వేధింపుల పట్ల జీరో టాలరెన్స్, జీరో రోడ్డు ప్రమాదాలు' లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'త్రిశూల్' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, వ్యవస్థీకృతంగా సాగుతున్న వేధింపులపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఈ అంశాలపై మంత్రుల కమిటీ లోతైన అధ్యయనం చేస్తుందని

- మిగతా 2వ పేజీలో

## డ్రోన్లతో వైద్యం, వ్యర్థాలతో సంపద.. ఏపీ కలెక్టర్ల బెస్ట్ ఐడియాలు!

- 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఉత్తమ పాలనా విధానాలపై ప్రజెంటేషన్లు
- అల్లూరి జిల్లాలో డ్రోన్లతో మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు
- చిత్తూరులో డిజిటల్ విద్య, బాపట్లలో ఆటిజం విద్యార్థులకు ప్రత్యేక స్కూల్
- వ్యర్థాలతో సంపద, భూసారం పెంపుపై ప్రకాశం, సత్యసాయి జిల్లాల ప్రాజెక్టులు
- క్రీడలు, వ్యవసాయంలోనూ అనంతపురం, కర్నూలు జిల్లాల నూతన ఆవిష్కరణల



## మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం

- తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- హైదరాబాద్ వెలుపల 9 కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు ప్రాతినిధ్యం
- ప్రజా జీవితంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమన్న ప్రభుత్వం
- బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, సీపీఐ సభ్యులు

2లో






## 10 ప్రధాన వాణిజ్య అవరోధాలను గుర్తించి తొలగించాలి

- 10 ప్రధాన వాణిజ్య అవరోధాలను గుర్తించి తొలగించాలి
- ఏటా 100 బ్రిక్స్ స్టార్టప్‌లను ఇతర సభ్య దేశాలకు విస్తరించాలి
- 1,000 కొత్త వ్యాపార భాగస్వామ్యాలను నిర్మించాలి
- 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: ప్రపంచ వాణిజ్యం అంతరాయాలు లేకుండా కొనసాగాలంటే నౌకాయాన స్వేచ్ఛ, సురక్షిత సముద్ర మార్గాలు, నావికుల భద్రత అత్యవసరమని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. పెరుగుతున్న ఆర్థిక బలాన్ని భారీ పెట్టుబడులుగా, నూతన వ్యాపార సంబంధాలుగా మార్చుకోవాలని బ్రిక్స్ సభ్య దేశాలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ఆయన ప్రసంగించారు.

## 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు

- రేవంత్ రెడ్డి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారన్న హరీశ్
- మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- సామాన్యుల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలన్న హరీశ్

తెలంగాణలో నిషేధిత భూముల జాబితా 22ఏ వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక



## 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు

సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేశారని హరీశ్ రావు ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్నారని, కానీ నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినా బాధితులకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం... బడా బాబులు నిర్మించిన అక్రమ నివాసాల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 2ఏ నిషేధిత జాబితా నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని తొలగించినప్పుడు, అదే జాబితాలో ఉన్న సామాన్య ప్రజల నివాసాలను, భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. తక్షణమే పేదల, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## శాంతిభద్రతలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)


ఆయన తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి జిల్లాకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 30 మంది కానిస్టేబుళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. గంజాయి సహా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి విస్తృత ప్రచారం కల్పించాలని, విశాఖపట్నం, తిరుపతి, అమరావతి నగరాల్లో డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, ప్రతి ప్రమాదాన్ని క్షుణ్ణంగా ఆడిట్ చేసి, అందుకు గల కారణాలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో నేరాలు 14 శాతం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 29.2 శాతం తగ్గాయని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం శిక్షల ఖరారు రేటు (కన్విక్షన్ రేటు) 47 శాతంగా ఉందని, దీనిని మరింత పెంచాలని సూచించారు. నేరం జరిగిన 30 నిమిషాల్లోపే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవాలని, కేసుల సత్వర పరిష్కారానికి 'వన్ కోర్టు-వన్ కానిస్టేబుల్' విధానాన్ని పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు. బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.



# అడ్డంకులు అధిగమించి ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

10 ప్రధాన వాణిజ్య అవరోధాలను గుర్తించి తొలగించాలని చెప్పారు. ప్రతి సంవత్సరం 100 బ్రిక్స్ స్టార్టప్‌లను ఇతర సభ్య దేశాల మార్కెట్లలోకి విస్తరించాలని, అలాగే ఏటా 1,000 కొత్త వ్యాపార భాగస్వామ్యాలను నిర్మించాలని పేర్కొన్నారు. ఈ మూడు అంశాలపై మన పురోగతిని ప్రతి ఏటా సమీక్షించుకోవాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన అడ్డంకులు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. ఇలాంటి అడ్డంకులను అధిగమిస్తూ మన ఆర్థిక శక్తిని నూతన వ్యాపార అవకాశాలుగా మార్చుకోవాలని స్పష్టంచేశారు. నౌకాయాన స్వేచ్ఛకు, నావికుల భద్రతకు భారత్ మద్దతిస్తోందని తెలిపారు. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు ప్రస్తుతం ప్రపంచ జనాభాలో దాదాపు సగం, ప్రపంచ జీడీపీలో 40 శాతం మరియు ప్రపంచ వాణిజ్యంలో నాలుగో వంతు కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ జీడీపీ సుమారు రెండున్నర రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ మాత్రం నాలుగున్నర రెట్లు పెరిగిందని హర్షం వ్యక్తంచేశారు.

**ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్**

ప్రపంచ వ్యాపారాలకు భారతదేశం చేసే ప్రతిపాదనలో మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక సాంకేతికతలను ప్రధానాంశంగా మోదీ పేర్కొన్నారు. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాల వేగవంతమైన విస్తరణతోపాటు నౌకా నిర్మాణం, సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, కీలక ఖనిజాలు, బయోటెక్నాలజీ రంగాల్లో నూతన సామర్థ్యాలను ప్రస్తావించారు. 'మేక్ ఇన్ ఇండియా, ఇన్నోవేట్ విత్ ఇండియా, స్కేల్ ఫర్ వరల్డ్'అన్నారు. ప్రపంచ మార్కెట్లకు భారత్ ఒక తయారీ కేంద్రంగా, సాంకేతికత, ఆవిష్కరణల కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య మరింత లోతైన సహకారం కోసం భారతదేశ డిజిటల్ ప్రజా మౌలిక సదు-పాయాలను ఒక వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. బ్రిక్స్ దేశాలు తమ సొంత మార్కెట్లకు అన-ువైన డిజిటల్ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి భారతదేశ అనుభవాన్ని వాడుకోవచ్చని అన్నారు. ఇండియాలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లు, 120కి పైగా యూనికార్న్‌లు ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి ఆవిష్కరణలను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లడంలో బ్రిక్స్ సహాయపడాలని కోరారు. వాణిజ్య అనుసంధానం అనేది మరో ప్రధాన అంశమని చెప్పారు. 2014 నుంచి భారత్ దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదు-ర్చుకుందని వెల్లడించారు. వాణిజ్య అడ్డంకులను తగ్గించడం, వ్యాపార అవకాశాలను విస్తరించడంపై బ్రిక్స్ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ప్రధానమంత్రి చెప్పారు.

## డ్రోన్లతో వైద్యం, వ్యర్థాలతో సంపద..

రాష్ట్రంలో నిర్వహించిన 8వ కలెక్టర్ల సదస్సులో ఏడుగురు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ పాలనా విధానాలను (బెస్ట్ ప్రాక్టీసెస్) ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో తాము చేపట్టిన వినూత్న కార్యక్రమాలను, వాటి ద్వారా సాధించిన సత్ఫలితాలను ఈ సదస్సులో వారు పంచుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'ప్రాజెక్ట్ డ్రోన్' పేరుతో మారుమూల గిరిజన ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా అత్యవసర ఔషధాలు, రక్త నమూనాలను సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంతి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 20 వేల మందికి ప్రయోజనం చేకూరిందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 'స్కూల్స్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్' ద్వారా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో 'స్వర్ణ భవిత' పేరుతో ఆటిజం బాధితులైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విద్య, వైద్యం, థెరపీ సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లాలో 'హణఋాఅ-డిజిటల్ స్కూల్ లెర్నింగ్' కార్యక్రమం కింద 22 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ వివరించారు. 'ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్' పద్ధతిలో తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి వివరించారు. ఈ విధానంలో జిల్లాలో ఇప్పటికే 1.94 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో 'వేస్ట్ టూ వెల్త్' ప్రాజెక్టు ద్వారా వ్యర్థాల నుంచి 'గ్రీన్ గోల్డ్' బ్రాండ్‌తో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. సత్యసాయి జిల్లాలో 'పునర్జీవం' ప్రాజెక్టు కింద బయోచార్‌తో భూసారాన్ని పెంచుతున్నామని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుతున్నామని శ్యామ్ ప్రసాద్ వివరించారు.



## విద్యే జీవితాన్ని మారుస్తుంది..

(మొదటి పేజీ తరువాయి)

కమిటీని నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. వీరికి 1.57 లక్షల మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారని చెప్పారు. జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని అన్నారు. ఉపాధ్యాయుల నియామకంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది టీచర్లను మాత్రమే నియమించిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా 55 రోజుల్లో 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. రైట్ టు ఎడ్యుకేషన్ ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి, తెలంగాణలో 17 మందికే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని వివరించారు. విద్యా రంగానికి గతంలో తగ్గుతూ వచ్చిన బడ్జెట్ కేటాయింపులను తమ ప్రభుత్వం పెంచుతోందని సీఎం చెప్పారు. అసెంబ్లీ సభ్యులు ఇచ్చిన సూచనలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తెలంగాణ విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు పునాదులు వేసిన పండిట్ నెహ్రూ ఆలోచనలతో ముందుకు సాగుతామని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం.

(మొదటి పేజీ తరువాయి)



ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ల్యాండ్ చోరీ.. రేవంత్ పాలనలో గజానికో గజదొంగ.. కేటీఆర్ నిప్పులు

ఇందిరమ్మ రాజ్యంలో యథేచ్ఛగా ల్యాండ్ చోరీ జరుగుతున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి సమాంతర రెవెన్యూ వ్యవస్థను నడుపుతూ నిషేధిత జాబితాలో కోటీ పదహారు లక్షల ఎకరాలను చేర్చి కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. గజానికో గజదొంగ మోపై ఇష్టారాజ్యంగా భూ దోపిడీకి తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అనుయాయులు, ఆయన అన్నదమ్ములు కలిసి ప్రజల ఆస్తులను చెరబడుతున్నారని విరుచుకుపడ్డారు. శుక్రవారం నిషేధిత భూములపై హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముందు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాటాడుతూ భూ పంపకాల వాటాలో తేడాలు రావడం వల్లే రేవంత్‌రెడ్డి తన క్యాబినెట్ మంత్రిని బర్తరఫ్ చేశారని విమర్శించారు.

**బీఆర్ఎస్ హయాంలో 16 లక్షల ఎకరాలే**

బీఆర్ఎస్ హయాంలో 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి గద్దెనెక్కిన తర్వాత ఏకంగా కోటీ పదహారు లక్షల ఎకరాలను 22-ఏలో పెట్టి ప్రజల ఆస్తులను చెరబట్టే కుట్రకు తెరలేపారని విమర్శించారు. తన నియోజకవర్గమైన సిరిసిల్ల పరిధిలోని గంభీరావుపేట మండలం



సముద్రాలింగాపూర్‌లో 800 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. 'కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంగరకలాన్‌లో కలెక్టరేట్ నిర్మించారు. విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టడంతో అక్కడి భూముల విలువ విపరీతంగా పెరిగింది. దీంతో ఆ భూములపై కాంగ్రెస్ పెద్దల కన్నుపడింది' అని కేటీఆర్ వివరించారు. ఓ అంతర్జాతీయ కంపెనీకి ఎకరం రూ.15 కోట్లకు ఇస్తామని ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకునేందుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. గతంలో తాను ఐటీ మంత్రిగా పనిచేశానని, సదరు అంతర్జాతీయ కంపెనీకి లేఖ రాస్తానని స్పష్టంచేశారు. కేసీఆర్ పాలనలో ప్రజల భూములకు భద్రత కల్పించారని కేటీఆర్ గుర్తుచేశారు. ధరణిని తెచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులువు చేశారని, రైతు వేలిముద్ర లేకుండా విక్రయించేందుకు అవకాశం లేకుండా చేశారని తెలిపారు. 2014కు ముందు భూములు కొనేందుకు ప్రజలు భయపడే పరిస్థితులు ఉండేవని చెప్పారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత కేసీఆర్ పాలనలో భూముల విలువ విపరీతంగా పెరిగిందని, రూ. 5 లక్షలుంటే ఎకరా భూమి రూ.50 లక్షలకు చేరిందని పేర్కొన్నారు. దీంతో పిల్లల పెండ్లిళ్లు, చికిత్స, ఇతరత్రా అత్యవసర ఖర్చుల కోసం ఇబ్బందులు లేకుండా ఉండేవారని చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత పరిస్థితులు తలకిందులయ్యాయని, భూముల విలువ పడిపోవడంతో ప్రజలు విలవిలలాడుతున్నారని వాపోయారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, రెండేండ్లలో తిరిగి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. 22ఏ జాబితాలో చేర్చిన ప్రతి భూమిని కాపాడుతామని భరోసా ఇచ్చారు. ఈ దుర్మార్గ, పరమ నికృష్ట సర్కార్‌కు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు నిర్మిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

# 22ఏ బాధితుల కష్టార్జితానికి అన్యాయం జరగొద్దు



- తెలంగాణ భవన్‌లో కేటీఆర్, హరీశ్‌రావును కలిసిన ఎల్బీనగర్ బాధితులు
- సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వినతి
- న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని బీఆర్ఎస్ భరోసా

**తొలివెలుగు, ఎల్బీనగర్ :** 22ఏ నిషేధిత జాబితాలో భూములు, ప్లాట్లు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులు తమ సమస్యను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో వారిని కలిసి తమ ఆవేదనను వివరించారు. తమ జీవితకాల కష్టార్జితంతో కొనుగోలు చేసిన భూములు, స్థలాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో వాటిపై హక్కులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని బాధితులు తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల సమస్యలను కేటీఆర్, హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసుకున్న ఆస్తుల విషయంలో అన్యాయం జరగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. 22ఏ సమస్య పరిష్కారం కోసం బాధితుల తరఫున బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బాధితులు కోరారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, బాధిత కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.






## ఆనందాన్ని పంచుదాం.. సమానత్వం పెంచుదాం


- రామోజీ ఫిలింసిటీకి 'భవిత' విద్యార్థుల విహారయాత్ర
- విద్యార్థులకు టీషర్టు పంపిణీ చేసిన బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత
- సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యం: బీర్ల అనితా ఐలయ్య

**తొలివెలుగు, రాజాపేట :** సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, ఆనందాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనితా ఐలయ్య అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం పీఎం శ్రీ పథకం నిధులతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని భవిత కేంద్రాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను రామోజీ ఫిలింసిటీకి విజ్ఞాన విహారయాత్రకు పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీర్ల ఫౌండేషన్ తరఫున ఉచితంగా టీషర్టను పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి పర్యవేక్షణలో జిల్లాలోని పలు మండలాల నుంచి 70 మంది దివ్యాంగ విద్యార్థులు, 36 మంది ఎస్కార్ట్ ఉపాధ్యాయులు విహారయాత్రకు బయలుదేరారు. తరగతి గదిలో విద్యతో పాటు విద్యార్థులకు సామాజిక అవగాహన, ప్రత్యక్ష పరిజ్ఞానం కల్పించాలనే ఉద్దేశంతో ఈ యాత్రను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనితా ఐలయ్య మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారికి సమాజంలో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు ఆనందంగా విహారయాత్రను ఆస్వాదించి కొత్త విషయాలను తెలుసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు టీషర్టు అందజేసిన బీర్ల ఫౌండేషన్ బాధ్యులకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజాపేట భవిత కేంద్రం నిర్వాహకురాలు సంధ్యారాణి, వివిధ భవిత కేంద్రాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- నాయబ్ తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి
- సెప్టెంబరు 17న అధికారికంగా వేడుకలు నిర్వహించాలని డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట :** సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని



ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజాపేట తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ వల్లపు ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించి, తెలంగాణ కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేసేలా ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోయ మధు, మాజీ ఎంపీటీసీ, మాజీ మండల అధ్యక్షుడు దాచేపల్లి రాజు, మండల ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మార్క శివ, నాయకులు మల్యాల భరత్, డొంకన సంపత్‌గౌడ్, కాకల్లా నవీన్, పోచంగళ్ల బాబు, పారుపల్లి సంజీవరెడ్డి, గాదె సాయి, బూర్గు భాస్కర్‌రెడ్డి, ఎమ్మా కుమార్, బోనగిరి సాయి తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాటం వల్లే నిజాం పాలనకు అంతం

- అమరుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి
- వేములకొండలో అమరవీరుల స్థూపానికి సీపీఐ నివాళులు

**తొలివెలుగు, వలిగొండ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన అంతమైందని, కేవలం పటేల్ సైనిక చర్య వల్ల మాత్రమే కాదని సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని వేములకొండ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ పులిపలుపుల రామలక్ష్మయ్య, కేశిరెడ్డి అనంతరెడ్డి, నీలం చెన్నయ్య, కాడిగళ్ల సాయిలు, ఎం.డి. ఖాజామైనుద్దీన్‌ల అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన పోరాటంలో సుమారు 4 వేల మంది అమరులయ్యారని తెలిపారు. పేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచి, వేలాది గ్రామాలను విముక్తి చేసిన వీరోచిత పోరాట చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోలేపాక యాదయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసింహచారి, గ్రామ శాఖ కార్యదర్శి పులిపలుపుల మల్లేశం, యాదగిరి, చంద్రయ్య, చక్రపాణి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.




# తుర్కపల్లి ఐటీ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలి
- టైర్ల పరిశ్రమల కాలుష్యంపై సమగ్ర తనిఖీలు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**తొలివెలుగు, హైదరాబాద్ :** ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండల అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల కాలుష్య సమస్యలపై ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శాసనసభలో ప్రభుత్వ దృష్టికి పలు అంశాలను తీసుకువచ్చారు. తుర్కపల్లి ఐటీ పార్క్‌ను త్వరగా అభివృద్ధి చేసి పరిశ్రమలు, ఐటీ సంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. తుర్కపల్లి మండలంలో ఐటీ పార్క్ ఏర్పాటు కోసం సుమారు 110 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించినట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. గిరిజన తండాలు, వెనుకబడిన గ్రామాలతో కూడిన తుర్కపల్లి ప్రాంతంలో ఐటీ సంస్థలు, పరిశ్రమలు, ఇతర ఉపాధి కల్పించే సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేసి ప్రముఖ సంస్థలను ఆకర్షిస్తే స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గడంతో పాటు తుర్కపల్లి ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఐటీ పార్క్‌ను త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరారు. ఆలేరు నియోజకవర్గంలోని కాటేపల్లి, బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న టైర్ల పరిశ్రమల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, ఇతర కాలుష్య కారకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా ప్రజలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. టైర్ల పరిశ్రమల సమస్యపై ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. సంబంధిత అధికారులు పరిశ్రమలను సమగ్రంగా తనిఖీ చేసి కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నాయా లేదా పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే ఆయా పరిశ్రమలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తుర్కపల్లి ఐటీ పార్క్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు.



## గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణకే వైద్య శిబిరాలు!

- దూదివేంకటాపురంలో ఉచిత వైద్య పరీక్షలు
- 110 మందికి బీపీ, షుగర్ పరీక్షలు
- 88 మందికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు

**తొలివెలుగు, రాజాపేట :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దూదివేంకటాపురంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీబీ, బీపీ, మధుమేహం (షుగర్) వ్యాధుల నిర్ధారణ కోసం ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ నడిమింటి నరేష్, ఉపసర్పంచ్ ఇరుగదిండ్ల వెంకటేష్, వార్డు సభ్యులు కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రజలు వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 88 మందికి ఉచితంగా ఎక్స్‌రే, తెమడ పరీక్షలు, సుమారు 110 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం వైద్య సిబ్బంది వారికి అవసరమైన సూచనలు, ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ సూపర్‌వైజర్ జ్యోతి, టెక్నీషియన్ నటేష్, ఎయిమ్స్ టెక్నీషియన్లు, ఎంపీహెచ్‌ఈవో భీకూనాయక్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, మాధవి, కవిత తదితరులు పాల్గొన్నారు.





## వలిగొండ అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

- గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకం
- ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తాం: ఎంపీడీవో జలంధర్‌రెడ్డి
- గ్రామపంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం

**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జి. జలంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వలిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యలు, మౌలిక వసతుల అవసరాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్ సమస్యలను నమోదు చేసుకున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జలంధర్‌రెడ్డి తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశం అనంతరం ఎంపీడీవో జి. జలంధర్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, నూతన గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్‌లను సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.





## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌కు 'దూదివెంకటాపురం' ప్రతిభ

- అండర్-14 విభాగంలో వివేక్, రాహుల్ ఎంపిక
- జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ
- విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం దూదివెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఎదుల వివేక్, ఎర్రోళ్ల రాహుల్ అండర్--14 విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు సుంచు విజయలక్ష్మి శుక్రవారం వెల్లడించారు. సెప్టెంబరు 9న నల్గొండ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, వివేక్, రాహుల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సెప్టెంబరు 12, 13 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు (పీడీ) పాతకోటి మధు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులతో పోటీపడి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరింత కృషి చేయాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు నర్సింహచారి, వెంకటేశ్వర్లు, రవీందర్, శ్రీనివాస్, ఎలేందర్‌రెడ్డి, కనకయ్య, విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

## నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు జరుపుకోవాలి

- రాజాపేట ఠాణాలో గణేష్ ఉత్సవ కమిటీలతో సన్నాహక సమావేశం
- మట్టి వినాయక విగ్రహాల పంపిణీ.. హాజరైన డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు

**తొలివెలుగు, రాజాపేట :** వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో,



పోలీసుల నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు కోరారు. పండుగ సందర్భంగా శుక్రవారం రాజాపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై తఖియుద్దీన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, అఖిలపక్ష నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ మాదాసు శంకర్ గౌడ్, ఎంపీడీవో కూతల నాగవేణి, నాయబ్ తహశీల్దార్ వల్లపు ప్రదీప్‌లతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటు, నిమజ్జనం, ఊరేగింపుల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారులకు అడ్డంగా ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎస్సై తఖియుద్దీన్ ఆధ్వర్యంలో సమకూర్చిన ఉచిత మట్టి వినాయక విగ్రహాలను డిఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుదాం

- చౌటుప్పల్‌లో ఉచిత విగ్రహాల పంపిణీ
- ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని మున్సిపల్ మాజీ ఛైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్ సౌజన్యంతో శుక్రవారం చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫోరం ట్రస్ట్ సభ్యుడు బొబ్బిళ్ళ మురళి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి వెన్ రెడ్డి రాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొబ్బిళ్ళ మురళి మాట్లాడుతూ.. 'మట్టి వినాయకులను పూజిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రినిటీ విద్యాలయ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ధర్మకర్తలు ఆవుల యేసు యాదవ్, వర్కాల రవిగౌడ్, బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.



# ఫ్రెషర్స్ పార్టీ డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తుండగా దాడి

- విద్యార్థులపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు ఫిర్యాదు
- పదునైన వస్తువుతో దాడి.. విద్యార్థికి గాయాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎల్బీనగర్ పోలీసులు

**తొలివెలుగు, ఎల్బీనగర్:** ఫ్రెషర్స్ పార్టీ కోసం డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. రామంతాపూర్‌లోని శ్రీనివాస హిల్స్ కాలనీకి చెందిన రాచకొండ సాయి వర్ధన్ (21) విద్యార్థి. సెప్టెంబరు 8న మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన స్నేహితుడు ఆర్. రిషికాంత్‌తో కలిసి ఎల్బీనగర్‌లోని భారత్ పెట్రోల్ పంప్ సమీపంలోని డెక్కన్ చాయ్ వద్ద ఫ్రెషర్స్ పార్టీ కోసం డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు విద్యార్థులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో అక్కడున్న స్థానికులు, సెక్యూరిటీ సిబ్బంది జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి పంపించినట్లు తెలిపాడు. అయితే కొంతసేపటి తర్వాత అదే వ్యక్తులు తిరిగి వచ్చి విద్యార్థులతో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో పదునైన వస్తువుతో సాయి వర్ధన్‌పై దాడి చేయడంతో శరీరంపై గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి అభిలాష్, అజయ్, చైనా తదితరుల పేర్లు తెలిసినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మునిపంపుల పాఠశాలలో గురుపూజోత్సవం, ముందస్తు చవితి



- ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన విద్యార్థులు
- పర్యావరణహితంగా మట్టి వినాయక ప్రతిష్ఠ

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలం మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం, ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి ఆశీస్సులు పొందారు. వరుసగా మూడు రోజులు సెలవులు రానుండటంతో ముందస్తుగా వినాయక చవితి వేడుకలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులే స్వయంగా మట్టి వినాయక విగ్రహాన్ని తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొడ్డి స్వామి మాట్లాడుతూ.. గురువులు అందించే విలువలతో కూడిన విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. నైతిక విలువలతో పాటు పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వాలంటీర్ గాదె పారిజాత, పాఠశాల శ్రేయోభిలాషి మన్నె పద్మారెడ్డి, ఏఏపీసీ ఛైర్మన్ బత్తిని వెంకటమ్మ, ఉపాధ్యాయులు తిరుమలరెడ్డి, వెంకటేశ్వర్లు, మనోహర్, వసంత, ఏ. మంజుల, త్రివేణి ప్రసాద్, జి. మంజుల, సరోజ, హరికిషన్, నాగలక్ష్మి, శ్రీశైలం, సునీత, పాఠశాల సిబ్బంది రాకేష్, జాకీర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




# పేదలకు భూమి ఇచ్చిన మహనీయుడు వినోబా

- భూదాన ఉద్యమంతో లక్షల ఎకరాల భూమి సేకరణ
- వినోబాభావే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: గున్న రాజేందర్‌రెడ్డి
- ఘనంగా 131వ జయంతి వేడుకలు

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** భూదాన ఉద్యమం ద్వారా భూమిలేని పేదలకు భూమిని అందించి, నిస్వార్థ సేవతో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు ఆచార్య వినోబాభావే అని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. వినోబాభావే 131వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వినోబా సేవా సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గున్న రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లుతో కలిసి టూరిజం పార్కులోని వినోబాభావే కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూమిలేని పేదలకు భూమిని అందించాలనే లక్ష్యంతో వినోబాభావే చేపట్టిన పాదయాత్ర ద్వారా లక్షల ఎకరాల భూమిని సేకరించినట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన.. దేశం సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టారని కొనియాడారు. వినోబాభావే ఆశయాలు, సిద్ధాంతాలను నేటి తరానికి



తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడిచి సమాజ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వినోబా సేవా సంఘం అధ్యక్షుడు ఏలే బిక్షపతి, నాయకులు కొయ్యడ నరసింహ, వెంకటరమణ, సిల్క్ సొసైటీ ఛైర్మన్ చింతకింది రమేష్, వేషాల మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## ధ్యానంతో నిర్మలమైన మనసు



తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి : నిర్మలమైన మనసు కోసం ధ్యానం ఎంతో ఉపయుక్తమని రామచంద్ర మిషన్-హార్ట్‌ఫుల్‌నెస్ ప్రధాన వక్త ఎన్వీ కృష్ణారావు అన్నారు. భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రంలోని డై హౌస్‌లో రామచంద్ర మిషన్-హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యానోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో సామూహిక ధ్యానం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో కృష్ణారావు మాట్లాడుతూ.. రోజురోజుకూ మానవాళిలో పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం దోహదపడుతుందన్నారు. ఆత్మ, మనసు శుద్ధికి హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ధ్యాన మార్గాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ మార్గాన్ని అనుసరిస్తున్న ఎంతోమంది ఒత్తిడి, బాధలను అధిగమించి ప్రశాంతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ధ్యానాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకుంటే సంతోషకరమైన జీవితం సొంతమవుతుందన్నారు. విద్యార్థులు ఏకాగ్రత పెంచుకుని చదువుల్లో రాణించేందుకు కూడా ధ్యానం ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో చిరంజీవి ప్రణవ్ కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తించడం, వివిధ ప్రదర్శనలు చేయడం ఆకట్టుకుంది. అనంతరం ముఖ్య అతిథులకు కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ఛైర్మన్ భారత లవకుమార్, ప్రధాన కార్యదర్శి సూరపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సారా సరస్వతి, హార్ట్‌ఫుల్‌నెస్ వాలంటీర్లు షరీఫ్, ప్రభాకర్, మంగళపల్లి, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన మధుయాష్కి గౌడ్

- ఏఐపీసీ ఛైర్మన్‌గా నియమించినందుకు ధన్యవాదాలు
- జాతీయ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఖర్గే సూచన

**తొలివెలుగు, ఎల్బీనగర్ :** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) ఛైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ శుక్రవారం బెంగళూరులోని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో ఏఐపీసీ ఛైర్‌పర్సన్‌గా కీలక బాధ్యతలు అప్పగించినందుకు ఖర్గేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానించడం, వారి ఆలోచనలు, నైపుణ్యాలను పార్టీ అభివృద్ధికి ఉపయోగపడేలా చేయడంపై చర్చించారు. దేశవ్యాప్తంగా నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఏఐపీసీని జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని మధుయాష్కి గౌడ్‌కు ఖర్గే దిశానిర్దేశం చేశారు.





# పోషకాహారంతో ఆరోగ్య సమాజం

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడవచ్చని మున్సిపల్ వైస్‌చైర్మన్ కొయ్యడ రజని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పురపాలక కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యాలయంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రజని శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ డ్రామాలో కృష్ణవేణి విద్యార్థులకు ప్రథమ స్థానం

- రాష్ట్ర స్థాయి పోటీలకు రామన్నపేట విద్యార్థుల ఎంపిక
- పర్యావరణ పరిరక్షణ నాటికకు జిల్లా స్థాయిలో గుర్తింపు

**తొలివెలుగు, రామన్నపేట :** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని






రాయగిరి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ డ్రామా పోటీల్లో రామన్నపేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారని పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. దీంతో వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. 'సేవ్ ఓషియన్.. సేవ్ ఫ్యూచర్ జనరేషన్' అనే అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ డ్రామా న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుందన్నారు. సముద్రాల కాలుష్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ముప్పును విద్యార్థులు కళ్లకు కట్టినట్లు వివరించారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ మురళి, ఉపాధ్యాయులు పునందాస్, అలీం, కల్పనలను కరెస్పాండెంట్ నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి తదితరులు అభినందించారు.

# ఒత్తిడి జయించి.. జీవితాన్ని గెలవాలి

- సి.ఎస్.ఎన్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆత్మహత్యల నివారణ దినోత్సవం
- '14416' టోల్ ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలన్న వైద్యులు


**తొలివెలుగు, భువనగిరి :** విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురైనప్పుడు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా స్నేహితులతో పంచుకోవాలని మానసిక వైద్యనిపుణురాలు డాక్టర్ ప్రీతి స్వరూప్ సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డిహెచ్‌ఎంఓ) ఆధ్వర్యంలో భువనగిరిలోని సి.ఎస్.ఎన్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి మానసిక సమస్యలు లేదా ఒత్తిడి ఉన్నా 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఉచితంగా కౌన్సెలింగ్ పొందవచ్చని తెలిపారు. నిపుణులైన సైకియాట్రిస్ట్‌లు మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపుతారని వివరించారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు మానసిక దృఢత్వం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వీణ, నిషిత, ఎండి బషీరుద్దీన్, మరియమ్మ, ఉమ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



# కరెంట్ కష్టాలు.. పంటలకు ట్యాంకర్ల నీళ్లు!

- విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఎండిపోతున్న వరి పంటలు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- ఒక్కసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి: సట్టు తిరుమలేష్





**తొలివెలుగు, రాజాపేట :** సాగుకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రాజాపేట మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ అన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయాలతో పంటలకు నీరందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మండలంలోని దూది వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు ఎర్రోళ్ల పెంటయ్యకు చెందిన వరి పొలం నీరు లేక ఎండిపోతుండటంతో ట్యాంకర్ ద్వారా నీటిని తరలించి పంటకు అందించినట్లు తెలిపారు. కరెంట్ సరైన సమయంలో రాకపోవడంతో బోర్లు, వ్యవసాయ బావుల నుంచి నీటిని తోడలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారని పేర్కొన్నారు. పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు అప్పులు చేసి మరీ ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పొలాలకు పారిస్తున్నారని తెలిపారు. సాగు కోసం చేసిన పెట్టుబడులు చేతికందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా మోటార్లు నడపలేకపోతున్నామని రైతులు చెబుతున్నారని అన్నారు.

**ఒక్కసారి క్షేత్ర పరిశీలన చేయండి:**

మండలంలోని పంట పొలాలను ఎమ్మెల్యే, ఎంపీ, వ్యవసాయ శాఖ అధికారులు ఒక్కసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సట్టు తిరుమలేష్ కోరారు. "దండం పెడతా.. ఒక్కసారి దయచేసి రైతుల పొలాలను పరిశీలించండి. వాస్తవ పరిస్థితులు మీకే తెలుస్తాయి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించకుండా అంతా సవ్యంగానే ఉందని చెప్పడం సరికాదన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల పొలాలను పరిశీలించి, వారి ఇబ్బందులను స్వయంగా తెలుసుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరాపై ఇచ్చిన హామీ మేరకు నిరంతరాయంగా కరెంట్ అందించి పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

# మద్యం దుకాణాల కటాయింపులో కలకలం రేపిన చీకటి బాగోతం..

హైదరాబాద్, సెప్టెంబర్11 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో భారీ లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఉన్న మద్యం దుకాణాన్ని అధికార పక్ష ముఖ్యనేత సన్నిహితుడికి గుట్టుచప్పుడు కాకుండా కట్టబెట్టిన వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ భుజాలు తడుముకుంటున్నది. ఖరీదైన మద్యం విక్రయాలు జరిగేందుకు అవకాశం ఉన్న మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ పెద్దలు గద్దలకు కట్టబెట్టిన తీరును బట్టబయలు చేస్తూ 'ముఖ్యనేత స్నేహితుడికి టానిక్ నజరానా' అనే శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ చీకటి బాగోతం రాష్ట్ర సచివాలయంలో కలకలం రేపింది.ప్రపంచ పటాలు పరిశీలించండి తమ దొంగాటను సమర్థించుకునేందుకు సికింద్రాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి పేరుతో 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ఖండిస్తూ లేఖ విడుదల చేశారు ఎక్సైజ్ అధికారి జీవన్‌కిరణ్. లేఖపై ఆయన పేరు గానీ, సంతకం కానీ లేకపోవడం గమనార్హం. ఈ వ్యవహారంపై ఇప్పటికే ప్రభుత్వం అంతర్గతంగా జరిపిన ప్రాథమిక విచారణలో లోగుట్టు బయటపడ్డట్టు తెలిసింది. ప్రభుత్వ ఆదాయం భారీగా నష్టపోయినట్టు అంచనాకు వచ్చినట్టు తెలిసింది.



**నోటీసు బోర్డుల ప్రదర్శన నాటకం**

గెజిట్ నోటిఫికేషన్‌ను సికింద్రాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయం, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం, జూబ్లీహిల్స్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రచురించామని అధికారులు ఖండన లేఖలో చెప్పుకొచ్చారు. కానీ, తెరవెనుక అసలు వాస్తవాలు రాష్ట్ర ప్రభుత్వ విభాగాలే బయటపెట్టాయి. కేవలం సాక్ష్యాధారాల కోసం బోర్డులపై గెజిట్ ప్రతిని పెట్టి, నిమిషాల వ్యవధిలోనే ఫొటోలు తీసుకుని వెంటనే తొలగించారని ప్రభుత్వ ప్రాథమిక విచారణలో తేలినట్టు తెలిసింది. ఇంతటి భారీ ఆదాయం తెచ్చిపెట్టే దుకాణానికి పత్రికా ప్రకటన ఎందుకు ఇవ్వలేదు? ఎక్సైజ్ పోర్టల్ ద్వారా బహిరంగ సమాచారాన్ని ఎందుకు అందుబాటులో ఉంచలేదు? ఈ ప్రశ్నలకు ఎక్సైజ్ ఇచ్చిన వివరణలో ఎకడా జవాబు లేదు. లాటరీలో వచ్చిన ఆ ఆరు దరఖాస్తుల వివరాలను నిష్పక్షపాతంగా పరిశీలిస్తే అవన్నీ ఒకే వ్యాపార గ్రూపునకు, ముఖ్యనేత అనుయాయులకు సంబంధించిన బినామీ దరఖాస్తులేనని తేటతెల్లమవుతుందని వ్యాపారులు చెప్తున్నారు.

# 22ఏ పేరిట ప్రజల జీవితాలతో చెలగాటం

కేసీఆర్ పాలన ప్రజల చుట్టూ తిరిగితే..రేవంత్‌రెడ్డి పాలన భూముల చుట్టూ పరిభ్రమిస్తున్నదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హైడ్రా, మూసీ, ఫ్యూచర్‌సిటీ ప్రాజెక్టు ఏదైనా భూ దోపిడీ కేంద్రంగానే సాగుతున్నదని నిప్పులు చెరిగారు. అసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ దాకా ఎవరి నోట విన్నా 22 ఏ మాటే వినిపిస్తున్నదని, కాంగ్రెస్ సర్కార్ కోటికి పైగా ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి లక్షలాది మంది ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. ఒక్క గీతతో లక్షలాది మంది ఆస్తులను జీరో వాల్యూ చేసిందని, 22ఏ ముసుగులో ప్రభుత్వం భారీ స్కామ్‌కు తెరలేపిందని, ప్రజల నుంచి 30 శాతం కమీషన్ల పేరిట నిలువునా దోచుకుంటున్నదని విరుచుకుపడ్డారు.నగర పర్యటనలను అన్వేషించండి కట్నం కింద ఇచ్చిన భూములను కాంగ్రెస్ సర్కార్ నిర్వాకంతో అల్లుండ్లు తీసుకోలేని పరిస్థితి ఉన్నదని, ఉన్న భూములను కొడుకులకు పంచలేని దుస్థితి నెలకొన్నదని వాపోయారు.. 'కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల ఆస్తులకు రక్షణలేదు.. పాలనపై సోయిలేదు' అని తూర్పారబట్టారు. 22ఏ నిషేధిత భూముల స్కామ్‌పై శుక్రవారం తెలంగాణ భవన్‌లో హరీశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 1908లో 22ఏ ప్రకారం ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్, ల్యాండ్ సీలింగ్ భూములను కాపాడాలనే ఉద్దేశంతో నిషేధిత జాబితా తెచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం 22ఏను దుర్వినియోగం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్‌పై నెపం నెడుతూ తప్పించుకొనేందుకు యత్నిస్తున్నదని ధ్వజమెత్తారు.

హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమిని కబ్జా పెట్టే కుట్ర చేశారని, కానీ విద్యార్థులు, బీఆర్ఎస్ ప్రతిఘటించడంతో వెనక్కితగ్గారని హరీశ్ గుర్తుచేశారు. కానీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఆ భూములను బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో కుదువపెట్టి 9.5 శాతం వడ్డీకి రూ.10 వేల కోట్ల అప్పుతెచ్చాడని.. అప్పు ఇప్పించిన బ్రోకర్‌కు రూ. 200 కోట్ల లంచం ఇచ్చాడని సంచలన విషయాలు వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలో 8 వేల ఎకరాలను బీఎస్ఈలో కుదువపెట్టి, మరో రూ. 10 వేల కోట్ల అప్పులు తెచ్చాడని, అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాలు తీసుకున్నాడని, అల్లుడికి, అన్నదమ్ములకు వందల ఎకరాలు కట్టబెట్టాడని చెప్పారు.వార్తాపత్రిక చందా ఇప్పుడు పాలిటెక్నిక్ భూములపై ముఖ్యమంత్రి కన్నుపడిందని, వాటి కోసమే పాలిటెక్నిక్ కాలేజీలపై కత్తిగట్టిండని సంచలన ఆరోపణలు చేశారు. హిల్ట్ పాలసీ, హైడ్రా, మూసీ వెనుక ఉన్నది భూ దోపిడీ కుట్రేనని దుయ్యబట్టారు. హైడ్రాకు బడాబాబుల ఇండ్లు కనిపించవని, పేదల గూళ్లు కూల్చడం మాత్రం తెలుసని దెప్పిపొడిచారు. 'మూసీ సుందరీకరణకు అటు వంద, ఇటు వంద ఎకరాలు ఎందుకు రేవంత్‌రెడ్డీ? మల్లన్న సాగర్ నీళ్లు తెచ్చి మూసీలో పోస్తే సరిపోదా? కేటీఆర్ ప్రారంభించిన ఎస్టీపీలను పూర్తిచేసే సోయిలేదా? ఇందుకు రూ.లక్ష కోట్లు తగలెయ్యాలా?' అని ప్రశ్నలవర్షం కురిపించారు. మూసీ బ్యూటిఫికేషన్ పేరిట 3 వేల ఎకరాల లూటిఫికేషన్ కుట్ర దాగి ఉన్నదని ధ్వజమెత్తారు.

**రాష్ట్రంలో 30 శాతం కమీషన్ల పాలన**

22ఏ ముసుగులో భూములను కొల్లగొట్టే కుట్ర దాగి ఉన్నదని, అందుకే ప్రజలకు వారసత్వంగా వచ్చిన భూములను నిషేధిత జాబితాలో చేర్చారని హరీశ్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌ది ముమ్మాటికీ 30 శాతం కమీషన్ల గవర్నమెంటేనని రాష్ట్రమంతా కోడై కూస్తున్నదని



దెప్పిపొడిచారు. ఊర్లకు ఊర్లు, ప్రజల నివాసాలు, అపార్ట్‌మెంట్లు, కాలనీలు అడ్డగోలుగా 22ఏలో చేర్చారని చెప్పారు. పాత ఇల్లు కూలగొట్టి కొత్తది కట్టుకుందామన్నా, బ్యాంకుల్లో లోన్లు తీసుకుందామన్నా వీలు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**పొంగులేటీ.. రాజీనామా చెయ్..**

కొత్తగా 22ఏలో ఒక్క గుంట కూడా పెట్టలేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి బొంకుతున్నాడని హరీశ్ మండిపడ్డారు. 'ఇంతకన్నా పచ్చి అబద్ధం ఉంటుందా? ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్టు ఉన్నది ఆయన వ్యవహారం' అని తూర్పారబట్టారు. కేసీఆర్ పాలనలో ఏనాడూ ఇలాంటి పరిస్థితి రాలేదని గుర్తుచేశారు. 'సమస్యలను బీఆర్ఎస్ పరిష్కరించింది.. కాంగ్రెస్ సర్కార్ సమస్యలను సృష్టించింది' అంటూ విమర్శించారు.




# పండగ వేళ స్వీట్లకు ధరల సెగ..

దసరా, దీపావళి పండగలు సమీపిస్తున్న వేళ వినియోగదారులకు చేదువార్త. పండగ పూట బంధుమిత్రులతో కలిసి నోరు తీపి చేసుకుందామనుకుంటే జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది. స్వీట్ల తయారీలో ఉపయోగించే ప్రధాన ముడిసరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో మిఠాయిల ధరలు భారీగా పెరిగాయి. సుమారు 30 శాతం వరకు ధరలు పెరిగినట్లు స్వీట్ షాపుల యజమానులు చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా పంచదార, బెల్లం, పాల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. రెండు నెలల క్రితం రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.40-45గా ఉన్న పంచదార ధర ఇప్పుడు రూ.65-70కి చేరింది. అదేవిధంగా, మంచి నాణ్యమైన బెల్లం కిలో ధర రూ.70-80 నుంచి ఏకంగా రూ.90-100కి పెరిగింది. ఇక పాల ధరలు కూడా గత నాలుగు నెలల్లో 16 శాతం వరకు పెరిగాయని వ్యాపారులు వాపోతున్నారు. ఈ ముడిసరుకుల ధరల పెరుగుదల ప్రభావం నేరుగా స్వీట్లపై పడింది. ఉదాహరణకు, రెండు నెలల క్రితం కిలో రూ.550-560గా ఉన్న ధూద్ పేడా ధర ఇప్పుడు రూ.750-780కి పెరగడమే ఇందుకు నిదర్శనం. పెరిగిన ఖర్చుల భారాన్ని తట్టుకునేందుకు ధరలు పెంచక తప్పడం లేదని వ్యాపారులు వివరిస్తున్నారు. పరిస్థితి ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో భవిష్యత్తులో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పంచదార ధరల పెరుగుదల ప్రభావం త్వరలో బిస్కెట్లు, శీతల పానీయాల కంపెనీలపైనా పడనుంది. బిస్కెట్ల ధరలు 2 నుంచి 4 శాతం పెరగవచ్చని లేదా ప్యాకెట్ల పరిమాణాన్ని తగ్గించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కృషికి ముఖ్యమంత్రి ప్రశంసలు





**పి జి ఆర్ ఎస్ పరిష్కారం లో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం (శాతం 38.4%)**

**పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌లో రాష్ట్రంలోనే పశ్చిమగోదావరి జిల్లా 4వ స్థానం (74.2 శాతం) లో నిలిచింది.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని అభినందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**భీమవరం, సెప్టెంబర్ 11:** ప్రజా సమస్యల పరిష్కారంలో 38.4 శాతంతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవగా, జిల్లా అధికారుల సేవలపై ప్రజల సంతృప్తిలో 74.2 శాతంతో రాష్ట్రంలోనే నాలుగు స్థానంలో నిలిచి జిల్లా ప్రత్యేకతను మరోసారి చాటుకుంది. జిల్లా అభివృద్ధి, సంక్షేమ ఫలాల చేరివేతపై ప్రశంసలు అందుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అమరావతి వేదికగా జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో మరోసారి ప్రశంసలు అందుకున్నారు. అమరావతిలో రెండు రోజులపాటు జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సేవలను ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. లిలిలిఅమరావతి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని జిల్లాల పరిపాలనా పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల సంతృప్తి తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ నిర్వహణలో జిల్లాల పనితీరును సమీక్షించిన ముఖ్యమంత్రి, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌లో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. లిలిపశ్చిమగోదావరి జిల్లా పీజీఆర్ఎస్ పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ విభాగంలో జిల్లాలో పరిష్కార శాతం 38.4 అత్యధిక స్కోర్ సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడం, అర్జీలపై నిరంతర పర్యవేక్షణ, అధికారుల బాధ్యతాయుత స్పందన, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన వంటి అంశాలపై జిల్లా యంత్రాంగం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఇది నిదర్శనమని ఆయన అభినందించారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత**

జిల్లాలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా పీజీఆర్ఎస్ వేదికను మరింత బలోపేతం చేయడంతో పాటు, అందిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నిబంధనల ప్రకారం పరిష్కారం చూపేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రతి అర్జీకి తగిన ప్రాధాన్యతనిస్తూ, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడటం, సంబంధిత అధికారుల పనితీరును సమీక్షించడం, పరిష్కరించిన అర్జీలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం వంటి చర్యల ద్వారా పీజీఆర్ఎస్ నిర్వహణలో జిల్లాకు మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

**పజల విశ్వాసాన్ని చూరగొంటున్న జిల్లా పరిపాలన:-**

ప్రజల నుంచి అందిన అర్జీలను కేవలం నమోదు చేయడానికే పరిమితం కాకుండా, వాటిపై వాస్తవ పరిస్థితులను పరిశీలించి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కారం అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన స్పందనకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా జిల్లా యంత్రాంగం ప్రజల నమ్మకాన్ని పొందుతోంది. పీజీఆర్ఎస్ పనితీరులో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ జిల్లాలో పరిష్కార శాతం 38.4 చేరుకోవడం జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియపై ప్రజలకు పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

**కలెక్టర్ కృషికి ముఖ్యమంత్రి అభినందనలు:-**

పశ్చిమగోదావరి జిల్లా పీజీఆర్ఎస్ పనితీరును, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు.




# ఆపిల్ నుంచి తొలి ఫోల్డబుల్ ఐఫోన్

**పుస్తకంలా తెరుచుకునే డిజైన్, దాదాపు కనిపించని మడత**

**పవర్‌ఫుల్ ఏ20 చిప్, 12 జీబీ ర్యామ్, సైడ్ టచ్ ఐడీ**

**సుమారు 2,000 డాలర్ల నుంచి ప్రారంభమయ్యే అవకాశం**

**ఐఫోన్ 18 సిరీస్‌తో పాటే ఈ ఫోన్ విడుదల**



టెక్ దిగ్గజం ఆపిల్ నుంచి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఫోల్డబుల్ ఐఫోన్ రాబోతున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 9న (రేపు) జరిగే 'సర్‌ప్రైజ్ అండ్ షైన్' ఈవెంట్‌లో ఈ సరికొత్త ఫోన్‌ను ఆవిష్కరించేందుకు కంపెనీ సిద్ధమైనట్లు సమాచారం. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ మోడళ్లతో పాటు దీనిని కూడా లాంచ్ చేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ ఫోల్డబుల్ ఫోన్‌కు 'ఐఫోన్ అల్ట్రా' లేదా 'ఐఫోన్ ఫోల్డ్' అని పేరు పెట్టవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. వివిధ నివేదికల ప్రకారం, ఇది పుస్తకంలా పక్కకు తెరుచుకునే (బుక్-స్టైల్) డిజైన్‌లో రానుంది. ఫోన్‌ను మడిచినప్పుడు ముందు వైపు ఉండే కవర్ డిస్‌ప్లే సుమారు 5.3 నుంచి 5.5 అంగుళాలు ఉండొచ్చు. తెరిచినప్పుడు లోపలి ప్రధాన స్క్రీన్ 7.6 నుంచి 7.8 అంగుళాల వరకు ఉంటుందని అంచనా. ముఖ్యంగా, స్క్రీన్ మధ్యలో మడత దాదాపు కనిపించకుండా, చాలా పలచని నిర్మాణంతో దీనిని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఫ్రేమ్ కోసం టైటానియం-అల్యూమినియం మిశ్రమాన్ని వాడొచ్చని తెలుస్తోంది. హార్డ్‌వేర్ విషయానికొస్తే, ఇందులో ఆపిల్ నెక్స్ట్ జనరేషన్ ఏ20 లేదా ఏ20 ప్రో చిప్‌ను వాడనున్నట్లు తెలుస్తోంది. సుమారు 12 జీబీ ర్యామ్‌తో ఇది పనిచేస్తుంది. వెనుక వైపు 48 ఎంపీ వైడ్, అల్ట్రావైడ్ లెన్స్‌లతో కూడిన డ్యూయల్ కెమెరా సెటప్ ఉండొచ్చు. అయితే, స్థలాభావం వల్ల టెలిఫోటో లెన్స్ ఉండకపోవచ్చని అంటున్నారు. పవర్ బటన్‌లోనే టచ్ ఐడీని అమర్చవచ్చని, ఫేస్ ఐడీకి బదులుగా దీనిని వాడొచ్చని లీక్స్ చెబుతున్నాయి. బ్యాటరీ సామర్థ్యం 5,000 నుంచి 5,800 ఎంఏహెచ్ మధ్య ఉండొచ్చని అంచనా. ధర విషయంలో ఇది అత్యంత ప్రీమియం ఉత్పత్తిగా నిలవనుంది. దీని ప్రారంభ ధర 2,000 నుంచి 2,500 డాలర్ల మధ్య ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సెప్టెంబర్ 9న ప్రకటన వెలువడిన తర్వాత, ఐఫోన్ 18 సిరీస్‌తో పాటే దీని ప్రీ-ఆర్డర్లు మొదలుకావొచ్చు. సెప్టెంబర్ చివరిలో లేదా అక్టోబర్ మధ్యలో డెలివరీలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఫోల్డబుల్ మార్కెట్‌లో ఉన్న ఇతర కంపెనీలకు ఇది గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నారు. అయితే, ఈ వివరాలన్నీ లీక్స్ ఆధారంగా వచ్చినవేనని, సెప్టెంబర్ 9న జరిగే అధికారిక ఈవెంట్‌లో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కొత్త హంగులతో 2026 మారుతి బాలెనో..



భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లలో ఒకటైన మారుతి సుజుకి బాలెనో, సరికొత్త హంగులతో 2026 ఫేస్‌లిఫ్ట్ మోడల్‌గా మార్కెట్లోకి వచ్చేసింది. ఆకర్షణీయమైన డిజైన్ మార్పులు, అత్యాధునిక సేఫ్టీ ఫీచర్లు, మెరుగైన మైలేజ్‌తో విడుదలైన ఈ కారు ప్రారంభ ధరను రూ. 6.09 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఉన్న నెక్సా (చీజుశూ) షోరూమ్‌లలో రూ. 11,000 చెల్లించి ఈ కొత్త బాలెనోను బుక్ చేసుకోవచ్చు.

**డిజైన్, ఫీచర్లలో కీలక మార్పులు**

ఈ కొత్త బాలెనోలో ప్రధానంగా ముందు భాగంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రీడిజైన్ చేసిన వైడర్ నెక్స్‌వేవ్ గ్రిల్, కొత్త బంపర్, క్రోమ్ ఫినిషింగ్‌తో కూడిన ఫెండర్ గార్నిష్, కొత్త రాజుణ ఐ=ాం కారుకు తాజా లుక్‌ను అందిస్తున్నాయి. ఎనిగ్మాటిక్ టీల్ అనే కొత్త రంగుతో సహా మొత్తం ఏడు రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది. లోపలి భాగంలో డ్యూయల్-టోన్ క్యాబిన్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 9-అంగుళాల స్మార్ట్‌ప్లే ప్రోం టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ (వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే), ప్రీమియం క్లారియన్ సౌండ్ సిస్టమ్, 360-డిగ్రీ కెమెరా, హెడ్-అప్ డిస్‌ప్లే (ఎఖఐ) వంటి ఫీచర్లను జోడించారు.

ఈ కొత్త బాలెనోలో భద్రతకు కంపెనీ పెద్దపీట వేసింది. ఈ సెగ్మెంట్‌లో తొలిసారిగా లెవెల్ 2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ (ూఆఈూూ)ను పరిచయం చేసింది. ఇందులో భాగంగా అడ్వాన్స్‌డ్ ఎమర్జెన్సీ బ్రేకింగ్, లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఉన్నాయి. దీనికితోడు, భారత్ చీజూూ టెస్టులో 4-స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించడం విశేషం. టాప్ వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ (ఇుూూ), హిల్-హోల్డ్ కంట్రోల్ వంటివి స్టాండర్డ్‌గా వస్తున్నాయి.

**కొత్త ఇంజిన్.. పెరిగిన మైలేజ్**

పనితీరు విషయంలోనూ బాలెనో అప్‌గ్రేడ్ అయింది. పాత 4-సిలిండర్ ఇంజిన్ స్థానంలో కొత్త 1.2-లీటర్ ్ర12జు 3-సిలిండర్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 83్రూా పవర్, 112.4 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ మ్యాన్యువల్, ఆటో గేర్ షిఫ్ట్ (ూ+ూ) ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లతో ఇది లభిస్తుంది. ఈ కొత్త ఇంజిన్ వల్ల మైలేజ్ గణనీయంగా మెరుగుపడింది. మ్యాన్యువల్ వేరియంట్‌పై 23.80 కి.మీ/లీ, ూ+ూ వేరియంట్‌పై 24.77 కి.మీ/లీ మైలేజ్‌ను కంపెనీ క్లెయిమ్ చేస్తోంది. ఐచీ+ వేరియంట్ మైలేజ్ కూడా 33.61 కి.మీ/కేజీకి పెరిగింది. మొత్తంమీద, అత్యాధునిక టెక్నాలజీ, మెరుగైన మైలేజ్, రిఫ్రెష్డ్ స్టైలింగ్‌తో హ్యుందాయ్ ఐ20, టాటా ఆల్ట్రోజ్ వంటి ప్రత్యర్థులకు గట్టిపోటీ ఇచ్చేందుకు బాలెనో సిద్ధమైంది. వేరియంట్ల వారీగా ధరలు, ఆన్-రోడ్ ధరల వివరాల కోసం దగ్గరలోని నెక్సా డీలర్‌షిప్‌ను లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

# డప్పు కళాకారులు చర్మకారులు కు నిబంధనలు సడలింపు

**సువర్ణ జ్యోతి,సెప్టెంబర్ 11: దెందులూరు :** డప్పు కళాకారులు చర్మ కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మంజూరులో సడలింపు ఇస్తూ జీవో జారీ చేస్తుందని సామాజిక ఉద్యమ కార్యకర్త కందుల రమేష్ అన్నారు. శుక్రవారం ప్రచారంలో భాగంగా దెందులూరులో ఆయన మాట్లాడుతూ డప్పు కళాకారులు చర్మకారులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు సెల్ఫ్ డిక్లరేషన్ ఫారం ఇతర అర్హత పత్రాలతో కలిపి సమర్పిస్తే సరిపోతుందన్నారు ఈ మేరకు సడలింపు ఇస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను డప్పు కళాకారులు చర్మకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాలు ప్రభుత్వం సడలించిన జీవోపై విస్తృతంగా ప్రచారం చేయాలని రమేష్ కోరారు

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఎరవలి :** శనివారం 33/11 ఖు సబ్‌స్టేషన్ పెరవలి పరిధిలో =ఖూా 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా పనులలో భాగంగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కాకరపర్రు గ్రామమునకు విద్యుత్ అంతరాయం కలుగును. కావున గృహ మరియు వాణిజ్య విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు కోరారు.



# గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు

**పెరవలి పెరవలి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శుక్రవారం డాక్టర్ అమృత వాలంటీర్ గా 37 గర్భిణీలకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెరవలి నందు జరుగుతుంది.ఇందులో భాగంగా శుక్రవారం రత్నా నర్సింగ్ హోమ్ తణుకు నుండి ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ అమృత ఎం.డి గైనిక్ స్వచ్ఛందం గా విచ్చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో నుండి వచ్చి నటువంటి 37 గర్భిణీలను ఉచిత ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన ఉచిత మందులతో పాటు వారికి తగిన వైద్య సలహాలు అందించారు. ఇందులో భాగంగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజనాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గర్భవతి తప్పనిసరిగా ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు మింగవలెనని అవసరమైన పౌష్టికాహారం తీసుకొనట ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకొనుట తగిన విశ్రాంతి తీసుకోని ప్రశాంతంగా ఉండాలని చూచించారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు గుర్తింపు

**ఏలూరు :** ఏ రంగంలోనైనా ఉత్తమ సేవలకు ప్రభుత్వ స్వచ్ఛంద ప్రజల గుర్తింపు



ఆదరణ ఉంటుందని రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సీనియర్ లైన్స్ క్లబ్ నాయకులు బివి రమణమూర్తి అన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన టీచర్ అమూల్య దంపతులను బివి రమణమూర్తి లైన్స్ క్లబ్ కార్యాలయంలో సత్కరించారు. గాలయిగూడెం ప్రాథమిక పాఠశాలలో సైతం టీచర్ అమూల్య ఉత్తమ విద్యా బోధన సేవలందించారని అన్నారు

# అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మర్యాదపూర్వక కలయిక......

**గుంటూరు:** గుంటూరు పర్యటనకు విచ్చేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో పలు విషయాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్షుడు నూకవరపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బారావు, క్లబ్ సభ్యులు పాల్గొని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా క్లబ్ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.



# బ్యాంకుల ప్రైవేటీకరణ కుట్రను తిప్పికొడతాం

**ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి**

**ఖాళీ పోస్టులు భర్తీ చేసి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి**

**యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో తణుకులో బ్యాంకు ఉద్యోగుల భారీ నిరసన**




**తణుకు, 11:** ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొడతామని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) నాయకులు స్పష్టం చేశారు. యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో భాగంగా తణుకులో బ్యాంకు ఉద్యోగులు నిరసన చేపట్టారు. స్థానిక కెనరా బ్యాంకు వద్ద ఉద్యోగులు ఆందోళన నిర్వహించి, అనంతరం తణుకు పట్టణంలో భారీ ప్రదర్శన చేపట్టారు. సమ్మె కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, లోకల్ బ్యాంక్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు వివివి సత్యనారాయణ, ఎ. రవికుమార్ మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులపై అమలు చేస్తున్న వివక్షాపూరిత ప్రోత్సాహక పథకాన్ని రద్దు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు కోరారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ప్రజల పొదుపు సొమ్ముతో నడుస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడటం అంటే ప్రజల ప్రయోజనాలను కాపాడటమేనని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి యుఎఫ్‌బియు నాయకులు కె. శ్రీనివాస్, చిన్ని, గోవింద్, రాజా, ఎన్.ఎస్. రామారావు, ఎస్. దుర్గాప్రసాద్, సీఐటీయూ నాయకులు జి. గోపి, గార రంగారావు తదితరులు నాయకత్వం వహించారు

# విశాఖ పర్యాటక రంగానికి మహర్దశ.

**-రూ.5 వేల కోట్ల పెట్టుబడులతో 16 స్టార్ హోటళ్లకు అనుమతులు**

**-ఏపీలో 7 స్టార్ హోటల్ ఏర్పాటుకు లీలా గ్రూప్ ఆసక్తి**

**-రుషికొండ భవనాల వినియోగంపై ఈ నెలాఖరుకు స్పష్టత: మంత్రి దుర్గేష్**



**విశాఖపట్నం,** విశాఖపట్నం పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా భారీగా ప్రైవేట్ పెట్టుబడులు వస్తున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రూ.5 వేల కోట్లకు పైగా ప్రైవేట్ పెట్టుబడులతో విశాఖలో 980 గదుల సామర్థ్యంతో 16 స్టార్ హోటళ్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆరు హోటళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, త్వరలోనే అవి అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. విశాఖలోని విశాలాక్షి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎన్ఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాన్ని మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం చెల్లుబోయిన రాము, నరసింహారావు, చంటిలకు శుభాకాంక్షలు తెలిపారు.

### వ్యాపారంతో పాటు సామాజిక సేవ అభినందనీయం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనసేన పార్టీకి చెందిన చెల్లుబోయిన నరసింహారావు వ్యాపారంతో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. స్థానికంగా పార్టీ సంస్థాగత బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. యువత వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో రాణిస్తూ ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. సీఎన్ఆర్ వెంచర్స్ తరహాలో మరిన్ని ప్రాజెక్టులు చేపట్టి యువతకు ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు.

### విశాఖ--విజయనగరం ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో విశాఖ--విజయనగరం ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి మరింత వేగవంతం కానుందని మంత్రి తెలిపారు. విశాఖలో పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. అరకు, లంబసింగి, బొర్రా గుహలు తదితర పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖలో జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ సమావేశం ద్వారా పర్యాటక శాఖ, టూర్ ఆపరేటర్ల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

### రుషికొండ భవనాలపై నెలాఖరుకు నిర్ణయం

రుషికొండ భవనాల వినియోగంపై ఈ నెలాఖరు నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉందని మంత్రి దుర్గేష్ తెలిపారు. రుషికొండలో నిర్మించిన భవనాలను హాస్పిటాలిటీ రంగానికి వినియోగించే అంశంపై కేబినెట్ సబ్‌కమిటీ ప్రాథమిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసినట్లు చెప్పారు. రుషికొండ కింద ఖాళీగా ఉన్న తొమ్మిది ఎకరాల్లో 7.5 ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనల పరిధిలో ఉన్నందున నిర్మాణాలకు అవకాశం లేదన్నారు. మిగిలిన 1.5 ఎకరాల్లో హాస్పిటల్, రిసార్ట్స్, మైస్ సెంటర్ల ఏర్పాటుకు సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానించినట్లు తెలిపారు.

### ఏపీలో 7 స్టార్ హోటల్‌కు లీలా గ్రూప్ ఆసక్తి

ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్య విధానంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ద్వారా పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం లభిస్తోందన్నారు. ఇటీవల జరిగిన టూర్ ఆపరేటర్ల సమావేశంలో లీలా గ్రూప్ ప్రతినిధులతో చర్చలు జరిగాయని, ఆంధ్రప్రదేశ్‌లో 7 స్టార్ హోటల్ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ఆసక్తి చూపుతోందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.



# స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి సమన్వయ కమిటీ సమావేశం

**ఎన్నికల నిర్వహణపై నాయకుల చర్చ**

**ఏలూరు:** ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయంలో ఏలూరు పార్లమెంటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డీలు సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, దెందులూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ ఘంటసాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. సమావేశానికి ఏలూరు పార్లమెంటు టీడీపీ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కూటమి పార్టీల మధ్య సమన్వయం, కార్యాచరణ, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై నాయకులు చర్చించారు. ఏలూరు పార్లమెంటు పరిధిలోని కూటమి పార్టీల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొని ఎన్నికల సన్నద్ధతపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# రెండవ రోజు కలెక్టర్ల సదస్సు ను జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీక్షిస్తున్న జిల్లా అధికారులు......

**భీమవరం** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అమరావతి లో నిర్వహించిన రెండవ రోజు కలెక్టర్ల సదస్సులో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. సదస్సును కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డ్వామా పిడి డాక్టర్ సి హెచ్ అప్పారావు, డిఆర్ డిఎ పిడి వేణుగోపాల్, సమాచారశాఖ డివిజనల్ పిఆర్ ఒ వి. శేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు వీక్షించారు.

# చంద్రబాబు వ్యాఖ్యలు పచ్చి అబద్ధం'

**జగన్ పాలనలో కొత్త డిస్టిలరీలు, బ్రాండ్లకు అనుమతులు ఇవ్వలేదు**

**వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు**



**పాలకొల్లు,** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో వైసీపీ ప్రభుత్వ హయాంలో 'జే బ్రాండ్స్' మద్యం కారణంగా 30 వేల మంది మృతి చెందారంటూ చేసిన వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధమని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదని, కొత్త బ్రాండ్‌కు కూడా అనుమతి ఇవ్వలేదని ఆయన తెలిపారు. 2019--24 మధ్య కాలంలో కల్తీ మద్యం కారణంగా జరిగిన మరణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఆర్‌బీ నివేదికల ప్రకారం 18 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు. అలాంటప్పుడు చంద్రబాబు చెప్పిన 30 వేల మంది మృతుల సంఖ్య ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. 2022 జూలై 19న లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం 2014--19 మధ్యకాలంలో రాష్ట్రంలో కల్తీ మద్యం కారణంగా 275 మంది మృతి చెందినట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయని ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలకు సంబంధించిన ఘటనలు, మద్యం సేవించి మృతి చెందిన సంఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని ఆయన ఆరోపించారు. వాస్తవ గణాంకాలను ప్రజల ముందుంచి మాట్లాడాలని చంద్రబాబును ఉమామహేశ్వరరావు కోరారు.

# రైస్ మిల్లులో ప్రమాదం.. కార్మికుడు మృతి.....

**వినాయక చవితి సందర్భంగా మిల్లు శుభ్రం చేస్తుండగా ఘటన**

**వేల్పూరు: సువర్ణ జ్యోతి, సెప్టెంబర్ 11:** రైస్ మిల్లులో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కిందపడటంతో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన వేల్పూరు గ్రామంలో చోటుచేసుకుంది. వేల్పూరు గ్రామానికి చెందిన ఆవిడి మీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం.. మీనా భర్త దుర్గాప్రసాద్ (40) సుమారు ఏడాది కాలంగా వేల్పూరు గ్రామంలోని అన్నపూర్ణ రైస్ మిల్లులో జట్టు కూలీగా పనిచేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా శుక్రవారం ఉదయం రైస్ మిల్లును శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కిందపడిపోయారు. తీవ్ర గాయాలతో ఆయన మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు బీఎన్ఎస్ఎస్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఇకపై తన పాత్రల విషయంలో జాగ్రత్తగా ఉంటానన్న రాశి

ఒకప్పుడు తెలుగు తెరపై వెలిగిపోయిన హీరోయిన్ రాశి, ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్‌లో బిజీగా ఉన్నారు. తిరువీర్ హీరోగా నటించిన 'పాపం ప్రతాప్' సినిమా నిన్న (శుక్రవారం) విడుదలై మంచి ఆదరణ పొందుతున్న తరుణంలో, ఈ చిత్ర సక్సెస్ మీట్‌లో రాశి తన సినీ ప్రస్థానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా మహేశ్ బాబు హీరోగా వచ్చిన 'నిజం' సినిమాలో తాను చేసిన నెగెటివ్ షేడ్ ఉన్న పాత్ర గురించి ప్రస్తావిస్తూ.. "ఆ రోల్ అంత నెగెటివ్‌గా మారుతుందని నేను అస్సలు ఊహించలేదు" అని పేర్కొన్నారు. కేవలం ఒక నటిగా అన్ని రకాల షేడ్స్ చేయాలనే ఉద్దేశంతోనే ఆ సినిమాలో నటించానని చెప్పారు.ఇకపై తాను చేసే పాత్రల విషయంలో చాలా స్పష్టంగా ఉంటానని రాశి తెలిపారు. "'పాపం ప్రతాప్' దర్శకుడు నా కోసమే ఈ పాత్ర రాశానని చెప్పారు. పాత్రలో దమ్ముండి, అది ప్రేక్షకులకు నచ్చుతుంది అనుకుంటేనే గ్రీన్ సిగ్నల్ ఇస్తాను. అది పాజిటివా, నెగెటివా అన్నది నాకు ముఖ్యం కాదు" అని ఆమె వివరించారు. గోపీచంద్ విలన్‌గా మెరిసిన 'నిజం'లో రాశి చేసిన బోల్డ్, నెగెటివ్ పాత్ర అప్పట్లో పెద్ద సంచలనమే సృష్టించింది. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత ఆమె ఒక మంచి హిట్ మూవీతో ప్రేక్షకులను పలకరించడం విశేషం.



# 'జైలర్-2' ఓటీటీ డీల్ 160కోట్లు?



సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జూన్‌లో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'జైలర్' బాక్సాఫీస్ బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో ఈ సీక్వెల్‌పై మరింతగా అంచనాలు ఏర్పడ్డాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో సంస్థ 160కోట్లకు కొనుగోలు చేసిందని తెలిసింది. ఇది ఇప్పటివరకు తమిళ సినిమా ఓటీటీ హక్కుల విషయంలో రికార్డని, రజనీకాంత్ సినిమాల్లో కూడా అత్యధికమని చెన్నై సినీ వర్గాలంటున్నాయి. చిత్ర నిర్మాణ సంస్థ సన్‌పిక్చర్స్‌తో ఇటీవలే అమెజాన్ ప్రైమ్ ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకుందని సమాచారం. 'జైలర్' తొలిభాగం దాదాపు 600కోట్లు వసూలు చేసింది. ఈ నేపథ్యంలో సీక్వెల్ బాక్సాఫీస్ పర్‌ఫార్మెన్స్‌పై ట్రేడ్ వర్గాలు నమ్మకంగా ఉన్నాయి. ఈ క్రేజ్ కారణంగానే అమెజాన్ ప్రైమ్ భారీ మొత్తానికి డిజిటల్ హక్కుల్ని కొనుగోలు చేసిందని అంటున్నారు. ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు తదితరులు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, విజయ్ సేతుపతి అతిథి పాత్రల్లో కనిపించనున్నారు.

# ప్రాజెక్టులతో రాశీ ఖన్నా ఫుల్ బిజీ!


తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. "ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్" అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా నటించిన 'లుక్కే' అనే వెబ్ సిరీస్ మే 8న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. 8 ఎపిసోడ్ల ఈ మ్యూజికల్ యాక్షన్ డ్రామా సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. వీటితో పాటు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి 'ఫర్జీ' సీజన్ 2లో, విక్రాంత్ మాస్సేతో 'తలాఖో మే ఏక్', ఆర్. మాధవన్‌తో 'బ్రిడ్జ్' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కూడా రాశీ చేతిలో ఉన్నాయి.

# 'మైసా' కోసం కసరత్తులు

'పుష్ప' ఫ్రాంఛైజీ, 'యానిమల్' 'ఛావా' చిత్రాలతో జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతుల్ని సంపాదించుకుంది అగ్ర నాయిక రష్మిక మందన్న. తాజాగా ఆమె 'మైసా' చిత్రంతో కెరీర్‌లోనే ఓ ఛాలెంజింగ్ రోల్‌ని పోషిస్తున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో గిరిజన తెగకు చెందిన గోండ్ మహిళగా కనిపించనుంది రష్మిక మందన్న. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల కోసం రష్మిక మందన్న ప్రతిరోజూ 8 గంటల కఠోర శిక్షణ తీసుకుంటున్నది. అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండిలాంగ్ పర్యవేక్షణలో బ్యాంకాక్‌లో ఈ ట్రెయినింగ్ జరుగుతున్నది. 'మైసా' కథ విన్న తర్వాత పాత్ర కోసం తాను శారీరకంగా, మానసికంగా మరింత దృఢంగా కనిపించాలని రష్మిక నిర్ణయించుకుందని, యాక్షన్ ఘట్టాలన్నీ సహజంగా కనిపించాలనే లక్ష్యంతో బ్యాంకాక్‌లో స్టంట్స్, కంబాట్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదని మేకర్స్ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. త్వరలో కేరళలో 16రోజుల పాటు జరిగే కీలక యాక్షన్ షెడ్యూల్ కోసం రష్మిక మందన్న ఈ శిక్షణ తీసుకుంటున్నది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాతలు: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.



# ఆధ్యాత్మిక కలయిక.. 'వాల్మీకి రామాయణం' కోసం జతకట్టిన ఇళయరాజా!




భారతీయ సంగీత శిఖరం, మాస్ట్రో ఇళయరాజా మరో అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. బాలీవుడ్ నుంచి ప్రతిష్ఠాత్మక 'వాల్మీకి రామాయణం' రాబోతుండగా ఈ చిత్రానికి ఆయన సంగీతం అందించబోతున్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ, ఇదొక ఆధ్యాత్మిక కలయిక.. సంగీతం ఇప్పుడు ఒక నైవేద్యం అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

# ఓరుగల్లు నుంచి స్వరప్రయాణం



సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న గ్రామీణ ప్రేమకథ 'గోదారి గట్టుపైన' చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు నాగవంశీ. సుభాష్‌చంద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా మే 8న విడుదలకానుంది. ఈ సినిమా గీతాలకు మంచి స్పందన లభిస్తున్నది. ఈ సందర్భంగా శనివారం చిత్ర సంగీత దర్శకుడు నాగవంశీ విలేకరులతో ముచ్చటించారు. 'మా స్వస్థలం హన్మకొండ. నాన్న సంగీతకారుడు. ఫ్లూట్, కీబోర్డ్ ప్లే చేస్తారు. మాకు సొంతంగా ఓ స్టూడియో కూడా ఉంది. నాన్న దగ్గరే కీ బోర్డ్ నేర్చుకున్నాను. షార్ట్‌ఫిల్మ్స్‌కి మ్యూజిక్ చేస్తున్నప్పుడు దర్శకుడు సుభాష్‌చంద్రతో పరిచయం ఏర్పడింది. అలా 'గోదారి గట్టుపైన' సినిమాకు అవకాశం దక్కింది' అన్నారు. కథానుగుణంగా సంగీత ప్రాధాన్యం ఉన్న చిత్రమిదని, ఓ రెట్రోసాంగ్‌ను సీనియర్ సింగర్స్ చిత్ర, యస్‌పీ చరణ్ ఆలపించారని, తాను కంపోజ్ చేసిన ట్యూన్‌ను వారు ప్రశంసించారని నాగవంశీ చెప్పారు. మొత్తం ఏడు పాటల్లో వేటికవే ప్రత్యేకంగా ఉంటాయని, స్వతహాగా తనకు మెలోడీస్ అంటే ఇష్టమని, స్వరరచనలో అదే తన బలమని తెలిపారు. 'ఇళయరాజా, రెహమాన్, మణిశర్మ, హారిస్ జైరాజ్‌లను స్ఫూర్తిగా తీసుకొని సంగీత ప్రయాణాన్ని ప్రారంభించాను. 'గోదారి గట్టుపైన' చిత్రం మంచి గుర్తింపును తీసుకొస్తుందనే నమ్మకం ఉంది'

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221**, Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com